## 'భూసార పరీక్షలతో రైతులకు మేలు'

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

పెన్‌పహాడ్, డిసెంబర్ 8: గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కేవీకే గడ్డిపల్లి ఆధ్వర్యంలో మల్లారెడ్డి యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థినులు ఆదివారం మండలోని దూపాడ్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఓ మామిడి తోటలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకోవడం వల్ల ఏ నేలలో ఏ పంట వేస్తే బాగా పెరిగి మంచి దిగుబడులు వస్తాయో అవగాహన వస్తుందన్నారు. నేలలో ఉన్న నత్రజని, భాస్వరం, పొటాషియం మొదలైన పోషకాలను మొక్కలు సేకరించడంతో భూసారం తగ్గుతూ ఉంటుందని, అందుకే పంట వేసే ముందే మట్టి నమూనా పరీక్షించడం ద్వారా ఆ నేలలో పోషకాలను తెలుసుకోవచ్చని తెలిపారు. తక్కువగా ఉన్న వాటిని ఎరువుల రూపంలో అందిస్తే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినులు సీహెచ్.ఐశ్వర్య, కె.అక్షయ, ఎం.అక్షిత, వి.అమూల్య, ఎల్.భావన, కె.భవాని, కె.భవ్య, పి.దీక్షిత, కె.దీప్తిప్రియ, రైతులు బత్తిని సత్యం, రామయ్య, ఇమ్మ, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య

● తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులు

అర్వపల్లి, డిసెంబర్ 8: భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్య అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. జాజిరెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని గొర్రెలు, మేకల పెంపకందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ తదితరులతో కలిసి ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంకుశ పాలన నుంచి స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు, ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడని కొనియాడారు. కొమురయ్య ప్రపంచ చరిత్రలో వీరుడిగా నిలిచాడన్నారు. కాగా, అంతకుముందు గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, పిల్లి రామరాజు యాదవ్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, మాజీ ఎంపీపీ మన్నె రేణుక లక్ష్మీనరసయ్యయాదవ్, మాజీ జడ్పీటీసీ అవిలయ్య, పోలేబోయిన కిరణ్, మధుకర్‌రెడ్డి, శ్రీరాములు, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నూతనకల్‌లో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నూతనకల్, డిసెంబర్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరసన దీక్ష ఆదివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు వీర స్వామి మాట్లాడుతూ..సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ వర్తింప జేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో వీరలక్ష్మమ్మ, అప్పారావు, పద్మ, శ్రీను, జానకిరాములు, లింగస్వామి, హరిక, కవిత, కాటమయ్య, రవీందర్, మల్లికాంబ, మాధవి, పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపులు

సమ్మేళనంలో పాల్గొన్న తిలక్‌నగర్ పాఠశాల పూర్వ విద్యార్థులు

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 8: సూర్యాపేట పట్టణంలోని జమ్మిగడ్డ తిలక్‌నగర్ పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక బాలాజీ గ్రాండ్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 17 ఏళ్ల తర్వాత స్నేహితులందరూ ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరాదాగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న, గోవర్ధన్, ప్రభాకరాచారి, సోమయ్య, శోభారాణి, ఎల్లయ్య, పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, నాగరాజు, ఆరీఫ్, జానీబాబా, జాషువా, ప్రవీణ్, ఉపేందర్, శివ, చారి, క్రాంతి, అశోక్, నాజియా, ఫౌజియా, సునీత, శిరీష, సరిత, లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

**1999-2000 బ్యాచ్ విద్యార్థులు..**

ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి: మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో 1999- 2000 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సమ్మేళనంలో ఉపాధ్యాయులు నలబోలు వెంకటరెడ్డి, అమ్మతారెడ్డి, సత్యనారాయణరెడ్డి, దయాకర్, రాంరెడ్డి, ప్రభాకర్, వెంకటమ్మ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## యాసంగికి సాగునీరు విడుదల చేయాలి

● సీపీఎం నాయకులు

నిరసన తెలుపుతున్న నాయకులు

తిరుమలగిరి, డిసెంబర్ 8: యాసంగి సాగుకు నీటిని విడుదల చేయాలని కోరుతూ ఆదివారం మండల పరిధిలోని వెలిశాల వద్ద సీపీఎం నాయకులు ఎస్సారెస్పీ కాల్వలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాసంగి సాగు సీజన్ ప్రారంభమై 20 రోజులు దాటినా ఇప్పటి వరకు ప్రభుత్వం, అధికారులు రైతులకు సాగునీరు అందించే ప్రయత్నం చేయడం లేదని అన్నారు. వెంటనే సాగునీరు అందించాలని కోరారు. నిరసన కార్యక్రమంలో నాయకులు కడెం లింగయ్య, గుమ్మడివెల్లి ఉప్పలయ్య, మట్టపెల్లి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ బాధితులను ఆదుకోవాలి

● బీఆర్ఎస్ నాయకుడు అప్పారావు

కోదాడ రూరల్, డిసెంబర్ 8: కోదాడ, మేళ్లచెర్వు ప్రధాన రహదారి నుంచి కాపుగల్లు మీదుగా రెడ్లకుంట వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రులు ఇటీవల శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అయితే రోడ్డు నిర్మాణంతో ఇళ్లు, స్థలాలు కోల్పోయే బాధితులకు ఇళ్లకు ఇళ్లు, స్థలానికి స్థలం చూపించాలని బీఆర్ఎస్ నాయకుడు దొంతగాని అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కాపుగల్లు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు గ్రామంలో ఎక్కడి నుంచి నిర్మిస్తారో తెలియక ప్రజలు తమ ఇళ్లు, స్థలాలు పోతాయని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక రాజకీయ నాయకులు ప్రజలకు భరోసా కల్పించాలని కోరారు. గంటా శ్రీను, జిల్లా బోసు బాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా నృసింహుని నిత్యకల్యాణం

గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు

మఠంపల్లి, డిసెంబర్ 8: మండల పరిధిలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుని నిత్యకల్యాణం అర్చకులు ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత కల్యాణ మండపంలో కల్యాణం జరిపించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించారు . ఈ పూజా కార్యక్రమాలలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఆలయ ఈఓ సిరికొండ నవీన్, అర్చకులు, దేవస్థాన సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### చింతలపాలెం కాటన్ మిల్లులో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

చింతలపాలెం, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని డాక్టర్ గారు అండ్ ఫ్రెండ్స్ కాటన్ మిల్లులో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు జరిపేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు నిర్ణయించినట్లు హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని హుజూర్‌నగర్, గరిడేపల్లి, మఠంపల్లి, మేళ్లచెర్వు, చింతలపాలెం మండలాల పత్తి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కార్యదర్శి తెలిపారు.

### 'గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి'

మఠంపల్లి, డిసెంబర్ 8: మండలంలోని వర్ధాపురం గ్రామంలో సీఎం కప్ క్రీడలను పీఈటీ వీరస్వామి, గ్రామపెద్దలు శ్రీనివాస్, రామ్మూర్తి, తిరపతయ్య, మధు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం వాలీబాల్ క్రీడలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మేళ్లచెర్వు, డిసెంబర్ 8: సిమెంట్ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సామాన్యుడు జీవించడం కష్టంగా ఉందన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని అన్నారు. ఎల్లయ్య, జాని పాల్గొన్నారు.

### బయోగ్యాస్ ప్లాంట్‌ను సందర్శించిన అగ్రికల్చర్ విద్యార్థినులు

గరిడేపల్లి, డిసెంబర్ 8: మండలంలోని గడ్డిపల్లి కేవీకేలో శిక్షణ పొందుతున్న మల్లారెడ్డి విశ్వవిద్యాలయానికి చెందిన అగ్రికల్చర్ విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పొనుగోడు గ్రామంలోని రైతు మేకల వీరయ్య ఇంట్లో బయోగ్యాస్ ప్లాంట్‌ను సందర్శించారు. 1984వ సంవత్సరంలో ప్రభుత్వ సబ్సిడీతో నిర్మించిన బయోగ్యాస్ ప్లాంట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్‌లో గేదెల పేడను ఉపయోగించి గ్యాస్‌ను ఉత్పత్తి చేయడం గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులు దీప్తి, గాయత్రి, గౌతమి, కీర్తి, లక్ష్మీప్రసన్న, మహిళా రైతు నాగలక్ష్మి పాల్గొన్నారు.

### అన్నదానం మహాదానం

అన్నదానాన్ని ప్రారంభిస్తున్న సీఐ కాశీ

కోదాడ రూరల్, డిసెంబర్ 8: అన్నదానం మహాదానమని హైదరాబాద్‌లోని కొంపెల్లి సీఐడీ డిపార్ట్‌మెంట్ సీఐ జి.కాశీ అన్నారు. కోదాడ పట్టణ పరిధిలోని హుజూర్‌నగర్ రోడ్డులో గల అయ్యప్ప సన్నిదానంలో గాలి శ్రీనివాస నాయుడు అధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాలధారులు, భక్తులు తదితలు పాల్గొన్నారు.

## వివాహిత అనుమానాస్పద మృతిపై కేసు

పాలకవీడు, డిసెంబర్ 8: ఓ వివాహిత అనుమానాస్పద మృతిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆదివారం ఎస్ఐ లక్ష్మీ నారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట నియోజకవర్గంలోని పెన్‌పహాడ్ మండలం సీతారాం తండాకు చెందిన బాణోతు విజయ(40) తన అక్క బాణోతు హసీతో కలిసి ఈ నెల 5న జాన్‌పహాడ్ దర్గా దర్శనానికి వచ్చింది. దర్గా దగ్గరికి తమకు పరిచయం ఉన్న నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడెం గ్రామానికి చెందిన పబ్బతి శరత్‌ను పిలిచారు. శరత్ మద్యం తీసుకొని రావడంతో ముగ్గురు కలిసి జాన్‌పహాడ్ శివారులో రైల్వేలైన్ వద్ద మద్యం సేవిస్తుండగా ఒక్కసారిగా విజయకు బీపీ పెరిగి అపస్మారక స్థితిలో వెళ్లిపోయింది. దీంతో ఆందోళన చెందిన శరత్ 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో కామినేని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ 6వ తేదీన రాత్రి మృతిచెందింది. కాగా, విజయ మృతిపై ఆమె భర్త లక్ష్యా అనుమానం వ్యక్తం చేస్తూ పాలకవీడు పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్

● మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న

నాగారం, డిసెంబర్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడాది పాలన ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని మాజీ ఎంపీపీ కూరం మణివెంకన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను అమలు చేయకుండానే విజయోత్సవాల పేరుతో ప్రజలను మభ్య పెడుతుందన్నారు. ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ముఖ్యంగా మహిళలకు ఇస్తామన్న ఆర్థిక సాయం, ఆసరా పెన్షన్ పెంపు, రైతు భరోసా నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటి వరకు ప్రారంభించలేదని, గురుకులాల్లో విద్యార్థులకు ఇచ్చే ఆహారంలో నాణ్యత కూడా పాటించకపోవడంతో అనేక మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలిస్తామని మాట ఇచ్చి 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామనడం నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చి, ఆ ఉద్యోగాలన్నీ తామే ఇచ్చామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకన్న కుటుంబానికి సాయం అందజేస్తున్న స్నేహితులు

నాగారం, డిసెంబర్ 8: మండలంలోని వర్ధమానుకోట గ్రామానికి చెందిన బుర్ర వెంకన్న ఇటీవల మరణించాడు. అతని కుటుంబానికి స్థానిక పాఠశాల 1998 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం రూ.36 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బండగొర్ల జనార్ధన్, మామిడి వెంకటేశ్వర్లు, కప్పల శంకర్, ఆకుల వెంకన్న, సిద్దం వెంకన్న, వీరస్వామి, వడ్డే రవి, రవికుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.

## నేరేడుచర్ల మండల ఓటర్ల జాబితా విడుదల

నేరేడుచర్ల, డిసెంబర్ 8: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితాను అధికారులు ఆదివారం ప్రకటించారు. 19 గ్రామ పంచాయతీల్లో 168 వార్డులు ఉండగా మొత్తం 21,797 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో పురుషులు 10,584 మంది, మహిళా ఓటర్లు 11,212 మంది ఉన్నారు. అత్యధిక ఓట్లు మండలంలోని దిర్శించర్ల గ్రామంలో 3,260 ఉండగా, అత్యల్పంగా ఎల్లారంలో 292 ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసే 168 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ముసాయిదా సైతం విడుదల చేశారు. వీటిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 12వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

## వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

● జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, డిసెంబర్ 8: సమాజ సేవలో వాసవి క్లబ్ సేవలు అభినందనీయమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వి.రామారావు అన్నారు. ఆదివారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కౌన్సిలర్ ఎస్‌కే.ఖదీర్, పైడిమర్రి సత్యబాబు, కొమరగిరి రంగారావు, గుడిగంట్ల అఖిల్, పబ్బా గీత పాల్గొన్నారు.

## రజకుల అభివృద్ధికి ఐక్యంగా పోరాడాలి

● రజక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీను

నేరేడుచర్ల, డిసెంబర్ 8: రజకుల అభివృద్ధి కోసం ఐక్యంగా పోరాడాలని రజక సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి చిలకరాజు శ్రీను పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రజకుల్లో ఐక్యత లేకపోవడం వలనే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా రజకుల అభివృద్ధిపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. తెలంగాణ వ్యాప్తంగా రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రజక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పు బిక్షపతి పాదయాత్రను ప్రారంభిస్తున్నారని తెలిపారు. ఆయన చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

## కార్మిక వ్యతిరేక చట్టాలపై ఉద్యమించాలి

● సీపీఐ జిల్లా నాయకుడు యాకూబ్

గరిడేపల్లి, డిసెంబర్ 8: కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల మెడకు ఉరితాళ్లలా మారాయని సీపీఐ జిల్లా నాయకుడు యాకూబ్ అన్నారు. ఆదివారం మండలంలోని రాయినిగూడెం గ్రామంలో కోలా నాగమణి అధ్యక్షతన నిర్వహించిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ నెల 16,17 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, బానోతు విజయ, సురభమ్మ, నాగలక్ష్మి, జ్యోతి, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### నేడు పత్తి కొనుగోలు కేంద్రానికి సెలవు

తిరుమలగిరి/నాగారం, డిసెంబర్ 8: తిరుమలగిరి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రానికి సోమవారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత కొద్ది రోజులుగా కొనుగోలు కేంద్రానికి భారీ ఎత్తున పత్తి వస్తుండటంతో నిల్వలు పెరిగాయని వెల్లడించారు. కావునా రైతులు మంగళవారం తిరిగి పత్తి తీసుకురావాలని సూచించారు.

### బాలెంలలో చోరీ

సూర్యాపేట రూరల్, డిసెంబర్ 8: మండలంలోని బాలెంల గ్రామంలో శనివారం రాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవుట నాగయ్య ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి తులంన్నర బంగారం, 5 తులాల వెండి దొంగిలించారు. ఆదివారం నాగయ్య కుమారుడు ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు రూరల్ ఎస్సై బాలునాయక్ తెలిపారు.

### ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడిగా సతీశ్

చివ్వెంల, డిసెంబర్ 8: మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా కొంగల సతీశ్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కాంపాటి సాగర్, ఉపాధ్యక్షుడిగా బాషపంగు బుచ్చిబాబు,అధికార ప్రతినిధిగా మొలుగూరి సునీల్, సంయుక్త కార్యదర్శిగా మనోజ్‌ను ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన ఎమ్మెస్పీ సూర్యాపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎర్ర వీరస్వామి, జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నూతనకల్, డిసెంబర్ 8: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం అర్ధరాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ మహేంద్రనాథ్ తెలిపారు. తాళ్లసింగారం గ్రామంలోని పాలేరు వాగు నుంచి రేణుకుంట్ల రాజలింగం అనే వ్యక్తి ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా సీజ్ చేసి ఆదివారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అర్వపల్లి, డిసెంబర్ 8: చెట్ల కొమ్మలు తొలగించనున్నందున నేడు అడివెంల 33 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడివెంల, తిమ్మాపురం, కుంచమర్తి, రామన్నగూడెంలో సరఫరా నిలిచిపోతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

చింతలపాలెం, డిసెంబర్ 8: మండలంలోని దొండపాడు గ్రామంలో ఆదివారం కుక్కల దాడిలో 8 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దొంగల సైదులు అనే రైతు ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన దొడ్డిలో ఉన్న గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. వాటి విలువ సుమారు రూ. 45 వేలు ఉంటుందని రైతు పేర్కొన్నాడు.

### ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరుకావాలి

నూతనకల్, డిసెంబర్ 8: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో నేడు నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు వారి సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై దరఖాస్తులు అందజేయాలని తెలిపారు.

## ముగిసిన తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 8: తెలంగాణ ఉద్యమకారులను, అమరుల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ నవంబర్ 24న సూర్యాపేట నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర ఆదివారంతో ముగిసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సామ అంజిరెడ్డి మాట్లాడుతూ..పాదయాత్రలో అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజాప్రతినిధులకు ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేయడంతో పాటు శ్రీకాంతాచారి వర్ధంతి రోజున భద్రాచలం రాములవారికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు ఉద్యమకారుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా నేటి వరకు ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదన్నారు. త్వరలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజాప్రతినిధులు చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. సంఘం నాయకులు బడుగం నాగేశ్వర్‌రావు, చాగంటి ప్రసాద్, రెహమాన్ అలీ, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, కొత్తగట్టు యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## 'ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం'

క్రిస్మస్ సంబురాల్లో సందేశమిస్తున్న బ్రదర్ అనిల్‌కుమార్

సూర్యాపేట టౌన్, డిసెంబర్ 8: ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయమని అంతర్జాతీయ సువార్తికులు బ్రదర్ అనిల్‌కుమార్ అన్నారు. విశ్వాస ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సూర్యాపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన క్రిస్మస్ సంబురాల్లో ఆయన పాల్గొని క్రైస్తవులను ఉద్దేశించి సందేశమిచ్చారు. ఏసుక్రీస్తు ప్రజలందరి పాపాలను తొలగించి వారిని దైవ కుమారులుగా మార్చేందుకు భూలోకానికి వచ్చారని అన్నారు. రెవరెండ్ గుంటూరు బాబురావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాస్టర్లు స